క్లుప్తంగా

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తిమ్మరాజుపేట సచివాలయంలో ఆధార్ సేవలు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు కోరారు. తిమ్మరాజుపేట సచివాలయంలో శుక్రవారం ఆధార్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా రక్షణభేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దేముడునాయుడు

రాంబిల్లి: ప్రజా రక్షణభేరి పేరిట ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు పిలుపునిచ్చారు. రాంబిల్లిలో ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. అసమానతలు లేని అభివృద్ధే లక్ష్యంగా సీపీఎం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామకృష్ణ, రాము, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో రైతులకు మేలు



రైతులకు ఈ-పంట నమోదు పత్రాలు అందిస్తున్న సర్పంచ్

మునగపాక: ఈ-పంట నమోదు ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి సచివాలయంలో ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, ఇతర పరిస్థితుల్లో పంటలకు నష్టం వాటిల్లితే ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ ఈ నెల 30లోగా రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మి, వీఏఏ తులసి, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సర్పంచ్ శివరాం

కోటవురట్ల: ప్రజారోగ్యమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ పైల శివరాం కోరారు. చినబొడ్డేపల్లి సచివాలయంలో వలంటీర్లు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. శనివారం నిర్వహించనున్న వైద్య శిబిరం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పేదల చెంతకే కార్పొరేట్ వైద్య సేవలను అందిస్తున్నారని కొనియాడారు. గ్రామంలో అవసరమైన ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకునేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు ఎంపీయూపీ పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఇంటింటి సర్వేలో టోకెన్లు పొందినవారితోపాటు, స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు కూడా వైద్య సేవలు పొందవచ్చన్నారు. నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తారన్నారు. సచివాలయ పరిధిలోని రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి ఇంటికీ రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

- ఊరూరా ఆరోగ్య శిబిరాలకు పోటెత్తుతున్న జనం
- ఉద్యమంలా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ప్రజారోగ్యమే పరమావధిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైద్య రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కీలకంగా మారాయి. ప్రతి గ్రామంలో నిపుణులైన వైద్యులతో అందిస్తున్న ఆరోగ్య సేవలపై అన్ని వర్గాల ప్రజల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది.

అచ్యుతాపురం(అనకాపల్లి): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వైద్యాన్ని చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడక సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ముందుగా స్టాల్స్‌ని పరిశీలించారు. గ్రామాల్లోని వృద్ధులు, ఆస్పత్రులకు వెళ్లలేని వారు ఈ శిబిరాల ద్వారా సొంత ఊర్లోనే వైద్యం పొందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని కొనియాడారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, సర్పంచ్ చేపల సుహాసిని, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, దుప్పుతూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు, చేపల వెంకటరమణ, వడిశెల శ్రీనివాసరావు, పూడిమడక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు



జానకయ్యపేటలో వైద్యశిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్ష అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో జానకయ్యపేట గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అనారోగ్యాలతో బాధపడేవారి కోసం ఈ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిబిరంలో అందుతున్న వైద్యసేవలపై రోగులను ఆరా తీశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ అంబేడ్కర్, పరిపాలన అధికారి సీతారామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోటవురట్ల: ప్రతీ ఇంటా సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంపీటీసీ పెట్ల రాంబాబు అన్నారు. బీకే పల్లిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు పర్యవేక్షణలో వైద్యులు అందిస్తున్న సేవల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజలకు ప్రధాన అవసరాలైన విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలోనే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారని, దేశంలో ఎక్కడా ఇలాంటి సేవలు అందట్లేదని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పెట్ల లింగన్నాయుడు, డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

ఎస్.రాయవరం: పేద ప్రజలకు మెరుగైన వైద్య పరీక్షలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి అన్నారు. గెడ్డపాలెం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 468 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 18 మందిని ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్యానికి సిఫార్సు చేశారు. ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు సురేష్‌కుమార్ 101 మందిని పరీక్షించి, అవసరమైన మందులు అందించారు. ఆప్తాలమిక్ విభాగంలో 115 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు. స్త్రీల వైద్య నిపుణులు జయలక్ష్మి 13 మందిని పరీక్షించి, వైద్య సేవలు అందించారు. ఒకరిని శిబిరం నుంచి నేరుగా కేజీహెచ్‌కి తరలించి, ప్రసవం చేయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఎంఈవో 1 అప్పారావు, పంచాయతీ కార్యదర్శులు రమేష్‌బాబు, సత్యనారాయణ, ప్రసాద్, చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గెడ్డపాలెం: ఆరోగ్య సలహాలు ఇస్తున్న ఆర్థోపెడిక్ వైద్యుడు సురేష్‌కుమార్

420 మందికి వైద్య పరీక్షలు

పాయకరావుపేట: పట్టణంలోని సచివాలయం-5 పరిధిలో గల పట్టణ వాసులకు జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా శుక్రవారం కొత్త హరిజనవాడలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 420 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యం కోసం శిబిరానికి హాజరైన వారికి రక్త పరీక్షలు, బీపీ, సుగర్, మలేరియా, టైఫాయిడ్ తదితర పరీక్షలు జరిపారు. పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.విద్యాసాగర్, శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కావ్య రోగులను పరీక్షించి, అవసరమైన మందులు అందించారు. డాక్టర్ కనకమహాలక్ష్మి ఈఎన్‌టీ వైద్య సేవలు, డాక్టర్ ఇషాక్ మహమ్మద్ కంటిచూపు నిర్ధారణ పరీక్షలు జరిపారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యులు అందిస్తున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సూరిబాబు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు జరిపించుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. రోగులకు మందుల కిట్‌లను అందించారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఈవోఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్, గ్రామకార్యదర్శి జె.చంద్రశేఖర్, పార్టీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, పంచాయతీ వార్డు సభ్యులు ధనిశెట్టి మహేష్, తాటిపాక నూకరత్నం, లోవరాజు, కేశనకుర్తి సత్తిబాబు, పెంటె గోవిందు తదితరులు పాల్గొన్నారు.



పూడిమడక శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



పూడిమడక ఆరోగ్య సురక్ష శిబిరంలో స్థానికులు



కొత్త హరిజనవాడ: రోగులకు మందుల కిట్‌లను అందిస్తున్న నాయకులు



గెడ్డపాలెం: నడవలేని వృద్ధుడిని శిబిరానికి తీసుకువస్తున్న వలంటీర్



గెడ్డపాలెం: శిబిరానికి వృద్ధురాలిని తీసుకొస్తున్న ఆశా కార్యకర్త



కొత్త హరిజనవాడ: పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న నాయకులు



బీకే పల్లి వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న సిబ్బంది, ప్రజా ప్రతినిధులు



బీకే పల్లిలో వైద్య సేవలకు బారులు తీరిన జనం



కొత్త హరిజనవాడ: వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న నాయకులు

ఉమ్మడి విశాఖ జిల్లాకు నాగులాపల్లి సొసైటీ ఆదర్శం

మునగపాక: నాగులాపల్లి పీఏసీఎస్ ఉమ్మడి విశాఖ జిల్లాకే ఆదర్శవంతమైన సొసైటీగా గుర్తింపు పొందిందని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో డీవీఎస్ వర్మ అన్నారు. లాభాల బాటలో పయనిస్తున్న నాగులాపల్లి సొసైటీని శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 25 సహకార సంఘాల సీఈవోలు సందర్శించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సహకార సంఘ పరిధిలో ఉన్న సభ్యులకు అన్ని రకాల రుణాలతో పాటు డిపాజిట్ల సేకరణ, బంగారు నగలపై రుణ సౌకర్యం, ప్రతీ ఏడాది 15 శాతం డివిడెండ్ పంపిణీ చేస్తూ ఉత్తమ సొసైటీగా గుర్తింపు పొందిందన్నారు. దీనికి కారకులైన సంఘ అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావు, సీఈవో మళ్ల స్వామిలను అభినందించారు. పాలకవర్గ సభ్యుల సహకారం, రైతుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా 20 మంది మహిళలకు జీఎల్‌జీ రుణాల కింద రూ.2 లక్షలను అందించారు. రాష్ట్ర సహకార బ్యాంక్ డీజీఎం శ్రీనివాస్, ఆప్కాబ్ మేనేజర్ రాజులు సంఘ సేవలను పరిశీలించి, రైతులకు అండగా ఉంటున్న నాగులాపల్లి సొసైటీ ద్వారా మరిన్ని సేవలందించాలన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నరాలశెట్టి బాబూరావు, కొయిలాడ యాదయ్యానాయుడుతో పాటు పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు. నాగులాపల్లి సొసైటీ అభివృద్ధి పథంలో పయనించడంలో విశేష కృషి చేస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు ఉమామహేశ్వరరావు, స్వామిలను ఘనంగా సత్కరించారు.



మహిళలకు రుణాలు అందిస్తున్న ప్రతినిధులు

ఈ-క్రాప్ జాబితా పరిశీలనకు తుదిగడువు నేడు

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధి అచ్యుతాపురం, యలమంచిలి, ఎస్.రాయవరం, రాంబిల్లి మండలాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 31,492 ఎకరాల్లో పంటల సాగుకు సంబంధించి ఈ -క్రాప్ నమోదు పూర్తయినట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ రవిప్రకాష్, యలమంచిలి ఏవో మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం తెరువుపల్లి రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) వద్ద ఈ-క్రాప్ నమోదు, ముసాయిదా జాబితాలపై రైతులకు అవగాహన కల్పించారు. శనివారం వరకు ఆర్బీకేల వద్ద ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీల నిమిత్తం ప్రదర్శనకు ఉంచుతామన్నారు. జాబితాలను రైతులు పరిశీలించి, ఏమైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే ఆర్బీకే కేంద్రాల్లో సరిచేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత ఎలాంటి సవరణలకు అవకాశం ఉండదన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఈ-క్రాప్ జాబితాల్లో వారు సాగు చేస్తున్న పంటల సాగు వివరాలను తనిఖీ చేసుకోవాలన్నారు.



తెరువుపల్లిలో రైతుల ఈ-క్రాప్ వివరాలను తెలియజేస్తున్న వ్యవసాయాధికారులు

ఢిల్లీకి నా మట్టి-నా దేశం కలశం

అచ్యుతాపురం(అనకాపల్లి): నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం మండలంలో సేకరించిన మట్టితో కూడిన కలశాన్ని ఢిల్లీకి పంపించనున్నట్లు భారతీయ జనతా పార్టీ నియోజక వర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు తెలిపారు. పార్టీ కార్యాలయంలో మట్టితో కూడిన కలశాన్ని ఉప్పవరానికి చెందిన పల్లి రాజబాబుకు శుక్రవారం అందించారు. రాజబాబు ఈ కలశాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లనున్నారు. కార్యక్రమంలో మేరుగు కాసుబాబు, బండారు కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మట్టి కలశాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

మునగపాక: సైబర్ మోసాలకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. మునగపాక ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం మండల స్థాయి ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కడ చూసినా మోసాలకు గురవుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. పిన్, ఓటీపీ నంబర్ల విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేవీ పనులను అడ్డుకున్న రైతులు

రాంబిల్లి: పెదకలవలాపల్లిలో శుక్రవారం నేవీ పనులను రైతులు అడ్డుకున్నారు. సోషల్ ఫారెస్ట్ స్థలాలను గతంలో నేవీకి అప్పగించారు. అయితే ఈ స్థలాలు తమ స్వాధీనంలో ఉన్నాయని, తమకు చెందిన జిరాయితీ స్థలాల్లో చెట్లను యంత్రాల సాయంతో తొలగిస్తుంటే అడ్డుకున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు తెలిపారు. తమ స్థలాల హద్దుల కోసం సర్వే చేయాల్సిందిగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఈ సర్వే చేయకుండానే పనులు చేపట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని గ్రామ రైతులు కోరారు.



పనులు అడ్డుకుంటున్న రైతులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పూడిమడకలో డ్రైనేజీ పనుల్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు సూచించారు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడక గ్రామంలో రూ.60 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలిచ్చారు. వాటరింగ్ ఎక్కువగా చేయాలని పేర్కొన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఈఏఎస్ సర్వే విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో సూర్యారావు

రాంబిల్లి: నవంబర్ 3న ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించే స్టేట్ ఎగ్జామినేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే(ఎస్ఈఏఎస్)ను విజయవంతం చేయాలని ఎంఈవో ఎం.సూర్యారావు కోరారు. రాంబిల్లిలో శుక్రవారం ఈ మేరకు ఎంపిక చేయబడిన ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. 3, 6, 9 తరగతి విద్యార్థులకు ఈ సర్వేలో భాగంగా ప్రత్యేక పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్వీ సూర్యనారాయణ, ఎంఈవో-2 సూర్యనారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ జి.గణేష్, పలువురు హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్‌తో ట్రాక్టర్ సీజ్

పాయకరావుపేట: పట్టణంలోని దుర్గాకాలనీ రోడ్డులో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను గమనించి, సీజ్ చేసినట్లు ఎస్ఐ ఎస్.రమేష్ శుక్రవారం తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు తెలిపారు. దీనిపై నర్సీపట్నం మైన్స్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

పాయకరావుపేట: పట్టణానికి చెందిన నక్కా కనకదుర్గరాజు(38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. మృతుడు కోటనందూరులో పాతమోటారు సైకిల్ షాప్ నిర్వహణలో రూ.8 లక్షలు నష్టపోయాడు. ఆ నష్టాన్ని తట్టుకోలేక మనస్తాపం చెంది, ఇంటి వద్ద గురువారం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి, తాగాడు. అతని భార్య మకరజ్యోతి గమనించి తునిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.



మృతుడు కనకదుర్గరాజు

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని క్రైట్స్, అచ్యుత జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించారు. 'లైంగిక వేధింపుల్లో పిల్లలు, మహిళల రక్షణ-సామాజిక పాత్ర' అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించనున్నట్లు పోలీసులు తెలిపారు.

ముసాయిదా ఓటరు జాబితా సిద్ధం

కోటవురట్ల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా ఓటరు జాబితా సిద్ధమైందని ఆర్డీవో జయరాం తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని పాములవాకలో జరుగుతున్న జగనన్న సమగ్ర భూ రీ సర్వే వివరాలను సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన అర్జీలు, వాటి పరిష్కారంపై సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సమగ్ర భూ రీ సర్వే చురుగ్గా జరుగుతోందన్నారు. ప్రస్తుతం మూడో విడత సర్వే జరుగుతుండగా ఇప్పటికే 50 శాతం పూర్తయిందన్నారు. పందూరులో డీ పట్టా భూముల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్టు తెలిపారు. మండలంలోని 9 గిరిజన గ్రామాల్లో అర్హులైన వారందరికీ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. మొదటి విడతలో 36 పట్టాలు సిద్ధం కాగా మరో 34 పట్టాలకు దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. అర్హులందరికీ పట్టాలు అందుతాయన్నారు. మండలంలో జిల్లా కలెక్టర్ నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కొన్ని అర్జీలు పరిష్కారం కావాల్సి ఉందని, అందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తహసీల్దారు జానకమ్మ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఆర్డీవో జయరాం

లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోండి

యలమంచిలి(అనకాపల్లి రూరల్): లైంగిక వేధింపుల నుంచి ఎలా బయటపడాలి? వేధింపులకు గురిచేసే వారిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై శుక్రవారం కొక్కిరాపల్లి అంబేడ్కర్ బాలికల గురుకులం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. స్థానిక రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నుంచి బాలికలు, మహిళల రక్షణ-సామాజిక పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గుడ్ టచ్, బాడ్ టచ్‌పై యలమంచిలి రూరల్ ఎస్సై సన్నిబాబు, మహిళా పోలీస్ సిబ్బంది బాలికలకు వివరించారు. ప్రస్తుత సమాజంలో వికృత పోకడల గురించి ఉదహరిస్తూ లైంగిక వేధింపుల నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలు, వాటి ప్రాధాన్యతను తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

ముసాయిదా ఈ-క్రాప్ జాబితా ప్రదర్శన

కోటవురట్ల: మండలంలోని పంట నమోదుకు సంబంధించి ముసాయిదా ఈ-క్రాప్ జాబితాలను అన్ని ఆర్బీకేలలో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి సరోజిని శుక్రవారం తెలిపారు. ఈ మేరకు స్థానిక ఆర్బీకేలో రైతుల సమక్షంలో జాబితాలను ప్రదర్శించి, వివరాలు తెలిపారు. మండలంలోని 14,825 ఎకరాలకు సంబంధించి ఈ-క్రాప్ పూర్తయిందన్నారు. ఈ జాబితాలను ఈ నెల 29 వరకు అన్ని ఆర్బీకేలలో సామాజిక తనిఖీ కోసం అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రామసభలు కూడా నిర్వహించి ముసాయిదా జాబితాను వినిపిస్తున్నామని, రైతులు హాజరై వివరాలు తెలుసుకోవాలని సూచించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే సవరణ కోసం ఆయా ఆర్బీకేలలో వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సంప్రదించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ-క్రాప్ ఖరీఫ్-2023 సీజన్ సవరణ కోసం ఇదే అఖరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తరువాత మార్పులు చేసే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వి.రాంబాబు, వీఏఏలు రాజు, మధు, రైతులు పాల్గొన్నారు.



కోటవురట్లలో ఈ-క్రాప్ బాబితాను ప్రదర్శిస్తున్న ఏవో సరోజిని